క్లుప్తంగా

రసాయన ఎరువులతో భూసారానికి ముప్పు

కొల్లూరు: రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగంతో భూసారానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని శ్రీ బయో సంస్థ జోనల్ మేనేజర్‌లు డీ రామారావు, సీహెచ్ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. మండలంలోని ఆవులవారిపాలెంలో రైతులకు ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులు అధిక మోతాదులో ఉపయోగించడం వల్ల క్రమక్రమంగా భూసారం తగ్గి పంట దిగుబడులు మందగిస్తాయన్నారు. భూసారం కోసం రైతులు జీవ సంబంధిత ఎరువుల వినియోగంపై అవగాహన పెంచుకొని అవసరమైన మోతాదులో వాడుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా సేంద్రీయ ఎరువులు ఉపయోగించాలని సూచించారు. భూమిలో జీవాన్ని కాపాడుకున్న పక్షంలో తెగుళ్లు, పంటకు హాని చేసే పురుగులను నేల తట్టుకోగలుగుతుందన్నారు. మట్టిని సారవంతం చేసుకోవడానికి ఇండిరూట్స్, హాలో చెక్ క్రియామైకో సిగ్నల్, శ్రీధరలతో పోషకాల లభ్యత పెరుగుతుందన్నారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి పశువుల వ్యర్థాలతో కూడిన జీవన ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీ బయో సంస్థ ఏరియా మేనేజర్ షేక్ ఫీర్ అహ్మద్, భూమిత్ర డీలర్ నాగవెంకటరమణ, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



గుంటూరు మెడికల్: బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఆళ్లవారిపాలెంలో వీఎల్ఎస్ ప్రసాద్ తల్లి గోవర్ధన్, బీబీ రావు తల్లి విష్ణు మొలకల రామాయమ్మ జ్ఞాపకార్థం అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గుంటూరుకు చెందిన ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అహల్య ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపులో సుమారుగా 200 మందికి మందులు పంపిణీ చేశామని తెలిపారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లీబిడ్డ క్షేమంగా ఉండి సులువుగా ప్రసవం అయ్యే మార్గాల గురించి, ప్రెగ్నెన్సీలో చేయాల్సిన వ్యాయామం గురించి, తల్లి తీసుకోవాల్సిన వ్యాక్సినేషన్ గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ కోయ ప్రియాంక, డాక్టర్ గౌతమ్, డాక్టర్ ప్రియాంక, ఆళ్లవారిపాలెం సర్పంచి శ్రీనివాసరావు, అశోక్, వెంకటేష్, ప్రసాద్, బి.సీతారామయ్య, వి.బి.రావు పాల్గొన్నారు.

బంగారం చోరీ

లక్ష్మీపురం: ఓ కాంట్రాక్టర్ ఇంట్లో బంగారం చోరీకి పాల్పడిన ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట 1/3వ లైన్‌లోని పయనీర్ సిటీ అపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టర్ రత్నసాయి నివసం ఉంటున్నాడు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 4.30 గంటల సమయంలో రత్నసాయి, భార్యతో కలసి బజారుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలో ఉన్న 67 గ్రాములు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బంగారం చోరీ చేసినట్లు గమనించారు. అయితే ఆ ఇద్దరు వ్యక్తులు ఎవరన్న విషయం పై చుట్టు పక్కల, అపార్ట్‌మెంట్‌కు వచ్చి పోయే వారి గురించి విచారించగా ఎలాంటి ఆచూకీ తెలియక పోవడంతో ఆదివారం రాత్రి అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5న విద్యుత్ చార్జీల పెంపుదలపై నిరసన

లక్ష్మీపురం: విద్యుత్ చార్జీల పెంపుదలపై జూలై 5న ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ నాయకుడు షేక్ వలి పేర్కొన్నారు. ఆదివారం శ్రీనగర్‌లో ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల రద్దు, చార్జీల తగ్గించాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలోని లిబర్టీ సినిమా హాల్ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అవగాహనతోనే నకిలీలకు అడ్డుకట్ట

- నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారాలు
- అనుమతులు ఉన్నచోటే విత్తనాలు కొనుగోలు చేయాలి
- రశీదులు, విత్తనాల కొనుగోలు సంచులు భద్రపరచాలంటున్న వ్యవసాయాధికారులు



దుకాణంలో పంపిణీకి సిద్ధం చేసిన విత్తనాలు

బాపట్లటౌన్: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా జిల్లాలో గత నాలుగురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నేలలు పదునెక్కి.. సాగుకు సై అంటున్నాయి. అన్నదాత మోముల్లో ఆశలు చిగురించాయి. బీడులుగా ఉన్న పొలాలు దుక్కిలు దున్ని.. విత్తనాలు సేకరించుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, పత్తి, వేరుశెనగ, మిర్చి, కంది, సజ్జలు, పెసర, మినుము పంటలు సాగు చేస్తుంటారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతుల అవసరాన్ని అవకాశంగా భావించి విత్తనాల విక్రయ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. తక్కువ ధరలు ఆశ చూపి నకిలీ విత్తనాలతో రైతులు నట్టేట ముంచుతున్నాయి.

విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యవసాయశాఖ నుంచి లైసెన్స్ పొందిన కంపెనీ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.

- విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ఇచ్చే బిల్లును పంటకాలం పూర్తయ్యేంత వరకు భద్రపరుచుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మొలక శాతం చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనకూడదు. గడువు దాటిన విత్తనాల జోలికి వెళ్లవద్దు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్లు, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకొని వాటిలో సూచించిన అంశాలను పరిశీలించాలి.
- బిల్లులపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు పన్ను నెంబర్, రైతుపేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నెంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

ఎరువులు.. పురుగుమందుల కొనుగోలులో..

మిషన్‌కుట్టుతో ఉన్న ఎరువుల సంచులను మాత్రమే వాడాలి. ఒక వేళ చేతికుట్టు ఉన్నట్లయితే సీల్ ఉందో లేదో చూసుకోవాలి.

- లైసెన్స్ దుకాణాల్లో కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన ఎరువుల బిల్లులను ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.



పొలంలో ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతున్న రైతు

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఇలా..

సాగుచేసేపైరు	సాగు విస్తీర్ణం హెక్టార్లలో	అవసరమయ్యే విత్తనాలు (కేజీల్లో)
వరి	1,96.045	98,02,250
వేరుశెనగ	648	64,800
పత్తి	1,81,373	4,53,432
మిర్చి	68,770	4,81,390
కంది	21,057	1,05,285
సజ్జలు	1161	8,127
పెసర	3492	52,380
మినుము	6354	1,27,080

- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఖచ్చితంగా ఉండాలి.
- ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే తక్షణమే వ్యవసాయశాఖ అధికారుల సహాయంతో పరీక్షలకు పంపాలి.
- చిల్లులు పడినా, చిరిగిన ఎరువుల బస్తాలను కొనుగోలు చేయకూడదు. ఎరువు సంచుల్లో ఎరువుతోపాటు అన్యపదార్థాలు కనిపిస్తే దానిని కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- బిల్లుపై కంపెనీ పేరు, ఎరువు పేరు, తయారీ తేది, గరిష్ఠ చిల్లర ధర, తూకం సరిచూసుకోవాలి.
- సూక్ష్మధాతు ఎరువుల్ని ప్రభుత్వం నుంచి తయారీ అనుమతి పొందిన సంస్థల నుంచే కొనుగోలు చేయాలి.
- క్రిమీసంహారక మందుల కొనుగోలు సమయంలో బిల్లులో మందుపేరు, కంపెనీపేరు, గడువుతేది, బ్యాచ్ నెంబర్, సీలు సక్రమంగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- లీకేజీ లేకుండా లేబుల్ ఉందో లేదో చూసి కొనుగోలు చేయాలి.
- సూచన పత్రంలో ఉన్న అంశాల ప్రకారం మందులు వినియోగించాలి.
- విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను బయోమెట్రిక్ విధానంలో కొనుగోలు చేయాలి.
- యూరియా, పోటాషియం తదితర ఎరువులను కొనుగోలు చేసే సమయంలో బస్తా తూకం, ప్రస్తుతం ధర తదితర వాటిని తప్పనిసరిగా చూసుకోవాలి.
- అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగు మందులను వాడకూడదు.
- వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు సూచించిన పురుగు మందులను వినియోగించుకోవాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. అక్రమార్కుల మోసపూరిత మాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకూడదు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే రైతులకు మేలు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్నిరకాల మేలైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వై. రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి

వెంకటేశ్వరరావు సేవలు ఎనలేనివి

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



హెచ్‌ఎం బెల్లంకొండ వెంకటేశ్వరరావును అభినందిస్తున్న డాక్టర్ ఈగూరు గణేష్

నిజాంపట్నం: ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దిన వెంకటేశ్వరరావు విద్యారంగానికి చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. అడవులదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేస్తున్న బెల్లంకొండ వెంకటేశ్వరరావుకు స్థానిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాడే ఉద్యోగ విరమణ తేదీ నిర్ణయించబడుతుందని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సేవలను నిలుపుదల చేయరాదని, సమాజ హిత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యార్లగడ్డ వెంకట రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం



రథయాత్రలో పూజలు చేస్తున్న భక్తులు

రేపల్లె: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం ఆదివారం చెరుకుపల్లి మండలంలో కనులపండువగా జరిగింది. రథోత్సవానికి సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీ భగవాన్ సత్యసాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఐదు రథోత్సవాలు జరుగుతున్నాయన్నారు. సత్యసాయిబాబా కీర్తిని వివరిస్తూ భక్తి సంకీర్తనలతో రథోత్సవాలు పర్యటిస్తున్నట్లు వివరించారు. బాపట్ల జిల్లాలో జరుగుతున్న రథోత్సవం సోమవారంతో ముగుస్తుందని చెప్పారు. నవంబర్ 23న సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. 185 దేశాలకు ఆరాధ్య దైవమైన సత్యసాయి బాబా ప్రేమ ప్రవాహిని రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గూడవల్లి సాయిబాబా దేవాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సమరసమ సేవా ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమశంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, కోటా వాణిశ్రీ, ఆలపాటి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం

తెనాలి: కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణానికి చెందిన నేత్ర వైద్యనిపుణుడు మౌళీకృష్ణ తాళ్లూరి సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జూన్ నెల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సమావేశంలో 'వృద్ధాప్యం–నేత్రసమస్యలు–అవగాహన' అంశంపై డాక్టర్ మౌళీకృష్ణ ప్రత్యేక ప్రసంగం చేశారు. జ్ఞానేంద్రియాల్లో కంటికి గల ప్రాధాన్యతను గుర్తు చేశారు. ముఖ్యమైన కంటి సమస్యల్లో శుక్లాలు ఒకటని చెప్పారు. నివారణకు మందులు లేవనీ, కేవలం సర్జరీనే పరిష్కారమని సూచించారు. నీటి కాసులుగా పిలుచుకునే గ్లాకోమా చాలా ప్రమాదకరమని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు శ్రీకాంత్, మాధవి, పవన్‌కుమార్

కర్లపాలెం: ప్రశాంతమైన జీవనం గడుపుతూ పౌష్టికాహారం తీసుకునే వారు ఆరోగ్యంగా ఉంటారని బాపట్ల యజ్ఞ హాస్పటల్స్ డాక్టర్లు శ్రీకాంత్, పవన్ కుమార్ తెలిపారు. పేరలి గ్రామంలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన యజ్ఞ హాస్పటల్స్ డాక్టర్లు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం, రక్తపోటు ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, రామకృష్ణా సేవా సమితి అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, బీ వెంకటేశ్వరరావు, ఎం.బుల్లియ్య, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరంలో...

గణపవరం గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ కేర్ విజన్ ఐ హాస్పటల్స్ డాక్టర్లు సుమారు 200ల మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

జీవనశైలి మార్పుతో వ్యాధులు దూరం

బాపట్ల: జీవనశైలిని మార్చుకోవడం ద్వారా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ హృద్రోగ వైద్యుడు డాక్టర్ రవి జంధ్యాల(అమెరికా) పేర్కొన్నారు. ఆదివారం ఈకో ఆస్పత్రి ఆవరణంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలతో పోలిస్తే మనదేశంలోనే మధుమేహం, హృద్రోగాలతో బాధపడుతున్నవారు అధికంగా ఉన్నారని చెప్పారు. తగినంత వ్యాయామం, నిద్ర, మితాహారం, మానసిక ప్రశాంతతలతో కూడిన జీవనమే మెరుగైన ఆరోగ్యాన్ని అందిస్తుందని వివరించారు. అనంతరం డాక్టర్ డాక్టర్ రవి జంధ్యాలను నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించినారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బాపట్ల ఈకో ఆసుపత్రి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ బీ శరత్ బోస్ అధ్యక్షత వహించారు. సభలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పంగులూరి హరిప్రసాద్, సంస్థ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, సంస్థ గౌరవాధ్యక్షుడు వంకాయలపాటి హరిబాబు, సంస్థ ఆత్మీయ సహకార అధ్యక్షుడు కరణం రవీంద్ర, ట్రెజరర్ కేశవులు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, యోగా గురువులు దూళిపాల శైలజ అల్లాడి రవికుమార్, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



యాజలి గ్రామంలో ఆర్థికసాయం అందజేస్తున్న అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్



పీతావారిపాలెంలో ఆర్థిక సాయం చేస్తున్న బీసీ, గౌడ సంక్షేమ సంఘం నేతలు

కర్లపాలెం: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగి పేదలు సర్వం కోల్పోయినప్పుడు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని బాపట్ల అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ సూచించారు. మండలంలోని యాజలి గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు పూరిళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన మామిడాల ఏడుకొండలు కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ సభ్యులు వంగపాటి శివ, మాడసాని బాలాజీ, చేజర్ల సతీష్, ఉమ్మారెడ్డి రామారావు, పల్లప్రోలు ఆంజనేయులు, దివి కామేశ్వరరావు, గొర్ల ఆంజనేయులు, హనుమంతరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ, గౌడ సంక్షేమ సంఘం నేతల వితరణ

నగరం: మండలంలోని కారంకివారిపాలెం శివారు పీతావారిపాలెంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఆదివారం బీసీ, గౌడ సంక్షేమ సంఘం నేతలు ఆర్థిక సాయం చేశారు. నలుగురు బాధితులకు రూ. 25వేల నగదును అందించారు. కార్యక్రమంలో బీసీ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు మోర్ల వెంకటకృష్ణ, మురళీ, శ్రీకాంత్, రాంప్రసాద్, తేజ, రాఘవయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులతో డాక్టర్ డి.శారద

తెనాలి: పట్టణానికి చెందిన డాక్టర్ శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్ భవనంలో ఉచిత షుగర్ వ్యాధి వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఈ శిబిరం కొనసాగుతూ వస్తోంది. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన దాదాపు 300 రోగులకు ఉదయాన్నే బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అల్పాహారం అందించాక మరోసారి పరీక్షలు చేశారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజంటేషన్‌తో ఆహారం, వ్యాయామం ప్రాధాన్యతను తెలియజేశారు. పాదాలకు పుళ్లు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. షుగర్ బాధితులు పూర్తిగా మందులపైనే ఆధారపడకుండా ఆహారం, వ్యాయామంతో నియంత్రణలో ఉంచుకోవాలనేది తమ వైద్యశిబిరం ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. ఇదే శిబిరంలో పలువురికి థైరాయిడ్, ఈసీజీ పరీక్షలు కూడా చేశారు. నెలకు సరిపడా మందులను అందజేశారు.

ఉన్నత విద్యతోనే బంగరు భవిష్యత్తు

తెనాలి రూరల్: ఉన్నత విద్యతోనే బంగరు భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన బాబూ జగ్జీవన్ రామ్(బీజేఆర్) కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం పురస్కారాలను అందించారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కమిటీ అధ్యక్షులు మేకల సురేష్ అధ్యక్షతన జరిగిన పురస్కార ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర జీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి. ఆనంద్ కుమార్, విశిష్ట అతిథిగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించేందుకు బీజేఆర్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో 525 మార్కులకు పైబడి సాధించి, పురస్కారానికి ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. జిల్లాలో 35 మండలాల నుంచి ఎంపికైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన 120 మందికి గానూ ఒక్కొక్కరికి రూ. ఐదు వేల నగదు, బ్యాగ్, వాటర్ బాటిల్, పొన్నెకంటి సత్యవేదాంతాచారి జ్ఞాపకార్థం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు బహూకరించారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి విజయ్‌బాబు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి మధుబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, 32వ వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి అతిథులుగా పాల్గొన్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడు అత్తోట శరత్ బాబు, కార్యదర్శి నలుకుర్తి సద్గుణరావు, కోశాధికారి సిద్దెల కమలాకర్, నలుకుర్తి రమేష్, అత్తోట శ్యాం పర్యవేక్షించారు.

గీత కులాలన్నీ ఒక తాటిపైకి రావాలి



సంఘీభావం తెలియజేస్తున్న గౌడ సంఘం నాయకులు

నెహ్రూనగర్: గీత కులాలన్నీ ఒక తాటిపైకి వచ్చి అన్ని రంగాల్లో రాణించడంతో పాటు రాజకీయంగా రాణించాలని అవసరం ఎంతైన ఉందని రిటైర్డ్ డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక నెహ్రూనగర్ 12వ లైనులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ మహాజన ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కులాలైన గౌడ, శెట్టి బలిజ, ఈడీగా, శ్రీశైయన, యాత కులాలకు చెందిన వారంతా రాష్ట్రంలో ఐక్యంగా ముందుకు సాగుతూ తమ హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను త్వరలో ఏర్పాటు చేసుకునేందుకు గాను ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు చాలపాటి వెంకటేశ్వరరావు, తులసీరామ్, డి కుమారస్వామి, ఎల్.అప్పారావు పాల్గొన్నారు.